క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 7 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో అర్బన్ ఈఈ పద్మనాభ పిళ్లై తెలిపారు. రాములవారి తేరు ఊరేగింపు సందర్భంగా సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. మార్కెట్ వీధి, చర్చివీధి, గాంధీ రోడ్డు, డీఐరోడ్డు, జెండామానువీధి, బజార్ వీధి, బ్రాహ్మణవీధి, హైరోడ్డు, పొనియమ్మన్ గుడివీధి, వేపమానువీధి, కయినికట్టువీధి, తేనబండ, దర్గామిట్ట ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థిగా పురుషోత్తం నామినేషన్



సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ పత్రం సమర్పిస్తున్న పురుషోత్తం

పూతలపట్టు: సమాజ్‌వాదీ పార్టీ పూతలపట్టు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పురుషోత్తం శనివారం నామినేషన్ వేశారు. అభ్యర్థి నామినేషన్ పత్రాన్ని ఆర్వో చిన్నయ్యకు అందజేశారు. శుక్రవారం మూడు నామినేషన్లు రాగా శనివారం ఒక నామినేషన్ దాఖలైందని అధికారులు తెలిపారు. ఎన్నికల నిబంధనల మేరకు నామినేషన్లు వేయాలని ఆయన పేర్కొన్నారు.

ముగ్గురు వలంటీర్ల రాజీనామా



రాజీనామా చేసిన వలంటీర్లు

గుడిపాల: మండలంలో టీడీపీ నాయకుల వేధింపులతోనే వసంతాపురం సచివాలయం పరిధిలో ముగ్గురు గ్రామ వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని ఎంపీడీవో రాజశేఖర్‌రెడ్డికి వారు అందజేశారు. వారు మాట్లాడుతూ జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకున్నాక తిరిగి వస్తామన్నారు. రాజీనామా చేసిన వలంటీర్లు సంధ్య, రాధ, జ్యోత్స్న ఉన్నారు. ప్రస్తుతం టీడీపీ వేధింపులు అధికంగా ఉండడం వల్లనే రాజీనామా చేసినట్లు వారు తెలియజేశారు.

23న త్రిమూర్తుల కల్యాణోత్సవం



కల్యాణోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రతాప్‌స్వామి

వెదురుకుప్పం: మండలంలోని ముత్తాలం సమీపంలో ఉన్న శ్రీ మరకతవల్లీ సమేత స్వయంభు సిద్ధేశ్వర క్షేత్రంలో మంగళవారం త్రిమూర్తుల కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామి తెలిపారు. శనివారం ఆలయాన్ని సందర్శించి కల్యాణోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతాప్ స్వామి మాట్లాడుతూ ప్రజలు సుభిక్షంగా ఉండాలన్న ఆకాంక్షతో సకాలంలో వర్షాలు కురిసి పాడి మురవాలనే సంకల్పంతో కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తులకు అవసరమైన వసతులు సమకూర్చుతున్నట్లు తెలిపారు. అదే రోజు రాత్రి బాలనాగమ్మ నాటక ప్రదర్శన తిరుపతి కళాకారులచే నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

తిరుచ్చిపై శ్రీవారి చిద్విలాసం



మాడవీధుల్లో దర్శనమిస్తున్న శ్రీవారు

పుత్తూరు: అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. శ్రీవారి గ్రామోత్సవంలో భాగంగా శనివారం వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని, పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి ఊయలలో కొలువుదీర్చారు. భక్తి కీర్తనల నడుమ శ్రీవారి ఊంజల్ సేవ కనుల పండువగా జరిగింది. అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారు ఉభయ దేవేరీలతో కలిసి తిరుచ్చి వాహనంపై కొలువుదీరారు. మేళతాలాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడవీధుల్లో విహరించారు. ఈ సందర్భంగా భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులను కటాక్షించి ఆలయానికి చేరుకున్న స్వామి, అమ్మవార్లకు మంగళహారతులిచ్చి ఏకాంత సేవ నిర్వహించారు.





చిత్తూరు: తోటపాళెంలో కార్పొరేటర్ గణేష్ ప్రచారం, చిత్తూరు: తిమ్మసముద్రంలో యువత ప్రచారం, గుడిపాల: మొగరాళ్లపల్లె పంచాయతీలో ఇంటింటా ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మోసం చేయడమే చంద్రబాబు నైజం

- పేదల సంక్షేమమే జగన్ లక్ష్యం
- వైఎస్సార్ సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి
- నగరంలో విస్తృతంగా వైఎస్సార్ సీపీ ప్రచారం



మిట్టూరులో ఓటర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: అమలు కానీ హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేయడమే టీడీపీ నైజమని వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి తెలిపారు. మిట్టూరు, సంతపేటలో ఆయన శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, పేదల సంక్షేమమే లక్ష్యంగా జగనన్న పాలన సాగించారని గుర్తుచేశారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాట ఇస్తే తప్పే అలవాటు లేదని ఆయన స్పష్టం చేశారు. ఇదివరకే ఇచ్చిన తాము హామీలను కాపీకొట్టి కులాల మధ్య చిచ్చు పెట్టడమే టీడీపీ నాయకులకు తెలిసిన రాజకీయమన్నారు. 14 ఏళ్ల సీఎంగా ఉన్న చంద్రబాబు వన్నెకులస్తుల కమ్యూనిటీ భవన్ నిర్మాణానికి స్థలం ఇవ్వలేదని గుర్తుచేశారు. అదే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం కేవలం ఐదేళ్ల పాలనలో వన్నె కులస్తుల కమ్యూనిటీ భవన్ నిర్మాణం కోసం రెండెకరాల స్థలం ఇచ్చిందన్నారు. ఇప్పుడు ఆ కులం మధ్య చిచ్చు పెట్టడానికి కుల, మతాల భవనాలు నిర్మిస్తామని టీడీపీని గెలిపించాలని ఆ పార్టీ నాయకులు చెప్పడం ఏంటని ప్రశ్నించారు. ఆఖరికి వైఎస్సార్‌సీపీ చేసే ప్రచారాన్ని కాపీ కొడుతున్నట్లు వివరించారు. కుల, మతాల మధ్య చిచ్చు పెట్టి ఎలాగైనా అధికారంలోకి రావాలని చూస్తున్నారని వివరించారు. ఫ్యాను గుర్తుకు ఓటేసి సంక్షేమ ప్రభుత్వాన్ని తెచ్చుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షులు జ్ఞానజగదీష్, కార్పొరేటర్లు నాయకులు మండీసుధ, ప్రభ, శిరీష్ రెడ్డి, ఉన్ని, దస్తగిరి, పూంగొడి, గఫార్‌ఖాన్, నారాయణ, రెడ్డెప్ప, కన్నన్, శీన పాల్గొన్నారు.

వాడవాడలా ప్రచారం

నగరంలోని పలు డివిజన్లలో శనివారం వాడవాడలా వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేశారు. డివిజన్లలో ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి గెలిపించాలన్నారు. వినాయకపురంలో నాయకులు సంతోష్, ఎతివార ప్రాంతంలో నాయకులు వెంకటేష్, తోటపాళెంలో కార్పొరేటర్ గణేష్, నాయకులు సూర్యప్రతాప్, శరవణ, తిమ్మసముద్రంలో యువత ప్రచారం చేశారు.

పేదల సంక్షేమం జగనన్నతోనే సాధ్యం

గుడిపాల: పేదల సంక్షేమం సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జనార్దన్, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, సర్పంచులు విక్టర్, రజినీకాంత్ అన్నారు. మండలంలోని మొగరాళ్లపల్లె పంచాయతీలో శనివారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలు అందాలంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే మళ్లీ రావాలన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉంటే పేదలకు సంక్షేమ పథకాలు అందుతాయని చెప్పారు. చంద్రబాబు మరోసారి బూటకపు హామీలతో వస్తున్నాడని, ఆయన మాటలు నమ్మొద్దని సూచించారు. టీడీపీ గెలిచే పరిస్థితి లేనందునే, చంద్రబాబు సాధ్యం కాని హామీలు ఇస్తున్నారని చెప్పారు. ప్రజలు వైఎస్సార్ సీపీ వైపే మొగ్గు చూపుతున్నారని, మరోసారి జగనన్న సీఎం ఖావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సాయికృష్ణ, ప్రకాష్, యోవాన్, క్రిష్ణన్, రవి, ఏసయ్య, పంచపడి, లారెన్స్, థామస్, వినోద్‌తోపాటు కార్యకర్తలు పాల్గొన్నారు.



నాడు : ముళ్లపొదలతో నిండిన అరుణానగర్ కాలనీ మార్గం




నేడు : సరికొత్తగా నిర్మించిన అరుణానగర్ కాలనీ సీసీ రోడ్డు

నాడు ముళ్ల పొదలు.. నేడు సీసీ రోడ్లు

ఐరాల: గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధికి నోచుకోని రోడ్లను ప్రస్తుత ప్రభుత్వం అద్భుతంగా నిర్మించింది. మండలంలోని వీఎస్.అగ్రహారం సమీపంలోని అరుణానగర్ కాలనీ నిలువెత్తు నిదర్శనం. ఈ కాలనీకి వెళ్లే మార్గం ముళ్లపొదలతో నిండిఉండేది. రోడ్డు మార్గం లేకపోవడంతో అప్పటి వరకు కాలనీలో కొంతమంది మాత్రమే ఇళ్లు నిర్మించుకున్నారు. కొంతమంది మధ్యలోనే నిర్మాణాలు నిలిపివేశారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాలనీలో మొత్తం ఆరు వీధుల్లో సుమారు రూ.30 లక్షలతో సీసీ రోడ్లను వేయించారు. దీంతో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసి గృహప్రవేశాలు చేయడం విశేషం.

శేషవాహనంపై సీతారాముల విహారం



శేషవాహనంపై ఊరేగుతున్న సీతారాములు

తవణంపల్లె: మండలంలోని అరగొండ శ్రీ కోదండ రామస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి సందర్భంగా శనివారం రాత్రి శేషవాహన సేవను అత్యంత వైభవంగా నిర్వహించారు. నవమి ఉత్సవాల్లో భాగంగా ఉదయం ఆలయంలో సీతారామలక్ష్మణులకు అర్చకులు అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక అలంకరణ, పూజలు చేసి ధూపదీప నైవేద్యం సమర్పించారు. రాత్రిలో ఉభయదారులచే శేషవాహన సేవను భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. ఉభయదారులు స్వామికి పూజా సామగ్రి, ప్రసాదాలు, సుగంధ పరిమళ పుష్పాలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. అర్చకులు పల్లకిని ప్రత్యేక పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం ఉత్సవమూర్తులను పల్లకిలో శేషవాహనంపై కొలువుదీరి మేళతాళాలు, మంగళవాయిద్యాలు నడుమ పురవీధుల్లో ఊరేగి భక్తులను కనువిందు చేశారు. భక్తులు పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. గరుడ వాహన సేవను ఘనంగా ఆదివారం రాత్రి నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహకులు తెలిపారు.

నడినెత్తిన భానుడి నిప్పులు



- ఎండ నుంచి రక్షణ చర్యలు తప్పనిసరి
- లేకుంటే ఆరోగ్యంపై ప్రభావం
- వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ సూచనలు

ఐరాల: సూరీడు నెత్తిన నిప్పులు కురిపిస్తున్నాడు. బయటకు వెళితే చాలు భానుడు భగభగలతో సెగలు రేగుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచే సూరీడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. రోజు రోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో సగటు జీవి అల్లాడుతున్నాడు. మండే ఎండల నేపథ్యంలో ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. వేసవిలో వడదెబ్బ తగలకుండా ఆయన పలు సూచనలు చేశారు. ప్రస్తుతం నియోజకవర్గంలో అత్యల్పంగా 39 డిగ్రీలు, అత్యధికంగా గత వారం తవణంపల్లె మండలంలో 40.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండలో ఎక్కువగా గడిపితే డీహైడ్రేషన్ (శరీరంలో నీటి శాతం తగ్గడం), డయేరియా(విరేచనాలు), వడదెబ్బ తదితర సమస్యలతో ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఉపాధి హామీ పథకం కూలీలు వడదెబ్బ బారిన పడకుండా నిర్దేశిత సమయానికి పనులు ముగించుకోవాలి. చిన్నారులు ఎండలో తిరగకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. వడదెబ్బకు ప్రాథమికంగా నీరే ప్రాణాధారం. ప్రజలు సాధ్యమైనంత వరకు కొబ్బరినీరు తీసుకోవాలి.

ఎండలో పనిచేయకపోవడమే మంచిది

ప్రజలు వేసవి కాలంలో వీలైనంత వరకు ఎండల్లో పని చేయకుండా ఉండడం మంచిది. ఉదయం, సాయంత్రం మాత్రమే ప్రజలు పనులు చేసుకోవడం మేలు. ఎండలో ఎక్కువ సేపు పనిచేస్తే చర్మం పొడి బారడం, కళ్లు ఎరుపెక్కడం, ఒళ్లు మంటలు, ఒళ్లు పొప్పులు వస్తాయి. ఒక్కోసారి అపస్మారక స్థితిలోకి వెళ్లే అవకాశం ఉంది. ఇలాంటి తరుణంలో వడదెబ్బకు గురైన బాధితులను శీతల ప్రాంతంలో ఉంచి చల్లని గాలి తగిలేలా చూడాలి. శరీరాన్ని తడి గుడ్డతో బాగా తుడవాలి. ఉష్ణోగ్రత ప్రభావం తగ్గని పక్షంలో దగ్గరలో ఉన్న ఆస్పత్రికి తరలించాలి.

వేసవిలో చేయకూడనివి

మండు వేసవిలో ఎక్కువగా తిరగరాదు. మద్యం తాగరాదు. రోడ్ల మీద రంగు శీతల పానీయాలు తాగరాదు. రోడ్లపై విక్రయించే కలుషిత ఆహారం తినరాదు. వేసవిలో మాంసాహారం తగ్గించాలి. నూనెలో వేసిన ఆయిల ఫుడ్ ఎక్కువగా తినకూడదు.

ఇవి తీసుకోండి

నీరు, పండ్ల రసాలు, కొబ్బరి నీరు, మజ్జిగ ఎక్కువగా తీసుకోవాలి. రోజుకు కనీసం 15 గ్లాసుల నీటిని తాగాలి. పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి. రోజూ రెండు పూటలా స్నానం చేయాలి. భోజనం మితంగా చేయాలి. లేత వర్ణం, తేలికైన కాటన్ దుస్తులు ధరించాలి. ఆరుబయట పడుకున్నప్పుడు దోమతెరలు వాడాలి. బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు తీసుకెళ్లాలి. చల్లని ప్రదేశంలో ఉండేందుకు ప్రయత్నించాలి. తాజా కాయగూరలు ఎక్కువగా తీసుకోవాలి. ఇంటి చుట్టుపక్కల పరిశుభ్రత పాటించాలి.

వడదెబ్బకు ప్రథమ చికిత్స

వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ ఉన్న ప్రదేశానికి చేర్చాలి. చల్లని నీటిలో ముంచిన తడి గుడ్డతో శరీరం బాగా తుడవాలి. ఉప్పు కలిపిన మజ్జిగను తాగించాలి. లేనిపక్షంలో గ్లూకోజు ద్రావణం తాగించాలి. వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీరు తాగించరాదు.

నేడు పల్లెచెరువులో ప్రచారం

తవణంపల్లె: మండలంలోని పల్లెచెరువు పంచాయతీలో ఆదివారం ఉదయం వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షులు హరిరెడ్డి తెలిపారు. ఉదయం 6.30 గంటలకు పల్లెచెరువు పంచాయతీలో, సాయంత్రం 4 గంటలకు వెంగంపల్లె పంచాయతీలో నిర్వహించే ఎన్నికల ప్రచారంలో పూతలపట్టు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ పాల్గొంటారని వివరించారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంస్థ ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మంత్రిని విమర్శించడం కిరణ్‌కు తగదు



శిరీష్‌రెడ్డి

బంగారుపాళెం: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని బీజేపీ నాయకుడు కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శించడం తగదని వైస్ ఎంపీపీ, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి శిరీష్‌రెడ్డి అన్నారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ, మంత్రి పెద్దిరెడ్డి జిల్లా అభివృద్ధికి పాటుపడుతున్నారని తెలిపారు. సీఎంగా కిరణ్‌కుమార్ రెడ్డి చేసిన అభివృద్ధి ఏంటో చెప్పాలన్నారు.

గజవాహనంపై కోదండరాముడు

చిత్తూరు రూరల్: శ్రీరామనవమి బ్రహ్మోత్సవాన్ని పురస్కరించుకుని చిత్తూరు నగరం రాములుగుడి వీధిలోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలో శనివారం స్వామివారు గజ వాహనంపై విహరించారు. మూలస్థానంలోని స్వామికి అభిషేక పూజలు చేశారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. స్వామిని వేణుగోపాల అలంకారంలో వసంతోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాత్రి స్వామివారు గజవాహనంపై విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. భక్తులు కర్పూర హారతులు పట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

ఓటు వినియోగం తప్పనిసరి



చిత్తూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

చిత్తూరు అర్బన్: ఓటుహక్కు తప్పనిసరిగా వినియోగించుకోవాలంటూ చిన్నారులు నినాదం చేశారు. ప్రతి ఓటరు ఎన్నికల్లో భాగస్వాములై ఓటు హక్కు వినియోగించుకోవాలని నినదించారు. ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాల్లో భాగంగా శనివారం నగరంలోని కొంగారెడ్డిపల్లి సీఆర్ రెడ్డి పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, మునిసిపల్ కార్పొరేషన్ స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్) బృందంతో కలిసి ర్యాలీ నిర్వహించారు. మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదేశాలతో పాఠశాల విద్యార్థులతో కలిసి కొంగారెడ్డిపల్లె పరిధిలోని పలు వీధుల్లో ఓటరు చైతన్య అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కు ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని, ఎథికల్ వోటింగ్ వేయాలని విద్యార్థులు నినాదాలు చేశారు. ప్రతి ఓటరు మే 13న జరగనున్న ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులంతా మా కుటుంబ సభ్యులతో తప్పకుండా ఓటు వేయిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో స్వీప్ అసిస్టెంట్ నోడల్ అధికారి చిన్నయ్య, ప్రిన్సిపల్ మమత, ఉపాధ్యాయులు, స్వీప్ నోడల్ టీం సభ్యులు పాల్గొన్నారు.

పెద్దిశెట్టిపల్లెలో వైద్యశిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ చంద్రమహేష్

గుడిపాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ప్రజలకు ఇంటి వద్దే వైద్యం అందుతోందని గుడిపాల పీహెచ్‌సీ డాక్టర్ చంద్రమహేష్ అన్నారు. పెద్దిశెట్టిపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు రక్త పరీక్షలు చేశారు. బీపీ, చక్కెర వ్యాధిగ్రస్తులకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది చంద్రశేఖర్, తేజ, ఇందుమతి, నిరోష, నరసమ్మ పాల్గొన్నారు.

కమ్మగుట్టపల్లిలో ఫ్యామిలీ డాక్టర్

పూతలపట్టు: మండలంలోని పేట అగ్రహారం విలేజ్ హెల్త్ సెంటర్‌కు చెందిన కమ్మగుట్టపల్లిలో శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి ప్రియాంక ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డయాబెటిస్, హైపర్ టెన్షన్, అనీమియా, మోకాళ్ల నొప్పులు, గుండె జబ్బులు కల సుమారు 68 మంది రోగులకు చికిత్సలు చేసి నెలకు సరిపడే మాత్రలు అందజేశారు. అందరికీ రక్త పరీక్షలు, బీపీ పరీక్షలు నిర్వహించారు. ఎండలు తీవ్రత ఎక్కువగా ఉండడంతో బయట తిరగకూడదని తెలిపారు. మంచినీరు, పానీయాలను ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. సీహెచ్‌ఓ శ్రీనివాసమూర్తి, సుష్మిత, పుష్ప లత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ సారథికే ▸ మళ్లీ పట్టం కడదాం

- చంద్రబాబు బురిడీ మాటలను నమ్మి మోసపోకండి
- జగనన్న వస్తేనే సంక్షేమ పథకాలు, అభివృద్ధి సాధ్యం
- ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి ఆశీర్వదించండి
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్ ఎంపీ రెడ్డెప్ప



నర్తపుచేనులో ఇంటింటి ప్రచారం చేస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్, ఎంపీ రెడ్డెప్ప

తవణంపల్లె: సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఓట్లు వేసి గెలిపించి మరోసారి సీఎంగా చేసుకుందామని పూతలపట్టు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్, చిత్తూరు ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప ఓటర్లకు పిలుపునిచ్చారు. మండలంలోని పట్నం సచివాలయం పరిధిలో శనివారం సిద్దంపల్లె, దళితవాడ, ఐరాల క్రాస్, పైపల్లె, నర్తపుచేను, పట్నం, పట్నం దళితవాడ గ్రామాల్లో ఎండలను సైతం లెక్క చేయకుండా వైఎస్సార్‌సీపీ వారు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచుతూ ఎన్నికల ప్రచారం చేశారు. సంక్షేమ పథకాలు ఇంటింటికీ రావాలంటే, అభివృద్ధి కార్యక్రమాలు పరుగులు తీయాలంటే జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమన్నారు. ప్రతి కుటుంబానికీ మంచి జరిగి ఉంటే ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి జగనన్నను ఆశీర్వదించాలని ఓటర్లను అభ్యర్థించారు. పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం జగనన్నకు ఓటేయాలని కోరారు.

చంద్రబాబు మాటలను నమ్మి మోసపోకండి

చంద్రబాబు బూటకపు హామీలను నమ్మి ప్రజలు మరోసారి మోసపోవద్దని పూతలపట్టు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గతంలో చంద్రబాబు సీఎంగా ఉండి ప్రజలను మోసం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. మళ్లీ ఈ ఎన్నికల్లో పదవీ వ్యామోహంతో అలవిగాని హామీలను ప్రజలకు వివరిస్తూ ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై రాష్ట్ర ప్రజలకు నమ్మకం ఉందన్నారు. ఎన్నికల్లో ఓట్లు రాబట్టేందుకు చంద్రబాబు కుటిల యత్నాలు, ప్రలోభాలకు గురి చేస్తున్నారని తస్మాస్ జాగ్రత్తగా ఉండాలన్నారు. రానున్నది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమని మళ్లీ సంక్షేమ రాజ్యం వస్తుందని జోస్యం చెప్పారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామని డాక్టర్ సునీల్‌కుమార్, రెడ్డెప్ప ప్రజలకు హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్‌కు, ఎంపీ అభ్యర్థి రెడ్డెప్పకు, పార్టీ నాయకులకు గ్రామాల్లో బ్రహ్మరథం పట్టారు. 'మా ఓట్లు జగనన్నకే' అంటూ అక్కిడికి వచ్చిన ప్రజలు అని నినాదాలు చేశారు. మండలంలో యువకులు, మహిళలు ఉత్సాహంగా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ ఇన్‌చార్జి, పారిశ్రామికవేత్త జి.ప్రకాష్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు హరిరెడ్డి, వైస్ ఎంపీపీ పట్నం ప్రతాప్‌రెడ్డి, పార్టీ నాయకులు హరికృష్ణారెడ్డి, రమణారెడ్డి, ప్రకాష్‌బాబురెడ్డి, రవిరెడ్డి, పూర్ణచంద్రారెడ్డి, కిషోర్ రెడ్డి, ఉమామహేశ్వర్ రెడ్డి, సుభాష్ రెడ్డి, భాస్కర్‌నాయుడు, తేజా రెడ్డి, సాయిరెడ్డి, నిరంజన్‌రెడ్డి, దూర్వాసులు రెడ్డి, రంజిత్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, శివాజీరెడ్డి, మధుసూదన్ రెడ్డి, హేమ, మురుగన్, పరదేశి, సుజిత్‌రెడ్డి, పాలాక్షిరెడ్డి, గిరిరెడ్డి, వేణురెడ్డి, హేమంత్, నితిన్‌రెడ్డి, దినేష్‌రెడ్డి, కోదండ, జనార్దన్, మహేష్, విజయసింహారెడ్డి, రెడ్డెప్ప రెడ్డి, శివారెడ్డి, సర్పంచ్ పుష్పలత, దాము, బాలకుమార్ రెడ్డి, జగన్నాథరెడ్డి, బాబిరెడ్డి, వినోద్‌యాదవ్, వరప్రసాద్‌రెడ్డి, డేవిడ్, మోహన్‌రెడ్డి, తులసిరెడ్డి, మురళిరెడ్డి, సురేష్, పార్టీ నాయకులు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అనుబంధ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.





ప్రచారంలో పాల్గొన్న మహిళలు, అవ్వతో ముచ్చటిస్తున్న ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్, నర్తపుచేనులో పార్టీ నాయకుల స్వాగతం